## ఆర్‌టిసి రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయండి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ 9వ వార్డు వద్ద ఆర్‌టిసి రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ కట్ల సంతోష్ విజ్ఞప్తి మేరకు స్పందించిన రాందాస్‌నాయక్ అధికారులను ఆదేశించారు. కట్ల సంతోష్ ఈ సందర్భంగాఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఇందిరమ్మ కాలనీ ప్రజలు వైరా మధిర రోడ్డులోని మార్కెట్‌యార్డ్ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ఆర్‌టిసి బస్టాప్ లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

## ప్రజలు కాంగ్రెస్ వైపే

**ప్రజాపక్షం/పాల్వంచ :** బిఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ వైపు నిలిచారని దీనితోనే కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయాన్ని సాధించినదని టిపిసిసి ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ శనివారం ఓ ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. భారీ విజయాన్ని అందించిన అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదములు తెలిపారు. ఈ విజయంతో ప్రజాప్రభుత్వానికి మరింత బాధ్యత పెరిగిందన్నా రు.

## క్రీడలు పట్టుదలను పెంచుతాయ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** క్రీడలు ఆత్మ విశ్వాసంతో పాటుగా పట్టుదలను పెంచుతాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.పాల్వంచ పట్టణంలో గల విద్యుత్ కళాభారతి మైదానంలో రెండు రోజుల పాటు జరిగే జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడలను శనివారం ప్రారంభించారు. ఈ క్రీడల్లో మణుగూరు, భద్రాచలం, ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, చర్ల, రుద్రంపూర్, పాల్వంచ జట్లు పాల్గొన్నాయి. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఓటమితో కుంగిపోకుండా రేపటి గెలుపునకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేటిపిఎస్ 7వ, దశ చీఫ్ ఇంజనీర్ సూర్యనారాయణ, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, ఫుట్‌బాల్ వ్యవస్థాపకులు సుధాకర్‌రాజు, ఎస్‌సి, సివిల్ యుగపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వానికి ప్రజలిచ్చిన ఆశీర్వాదం

**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో 18వ వార్డులో పోటీ చేసిన తనను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని కౌన్సిలర్ కోన ధనికుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా విజయమని, ప్రజా ప్రభుత్వానికి ప్రజలిచ్చిన ఆశీర్వాదమని అన్నారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై ఉంచిన విశ్వాసం, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ఉన్ననమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని తెలిపారు. తనకు గెలుపుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, డివిజన్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ 28వ డివిజన్‌లోని శాబాదునగర్‌కు చెందిన సిపిఐ దివంగత నేత శాబాద్ నారాయణరెడ్డి నాలుగో వర్ధంతిని శనివారం నిర్వహించారు. దీనికి ఆ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా 28వ వార్డు నూతన కౌన్సిలర్‌గా ఎన్నికైన రంగారావును శాబాద్ కుటుంబ సభ్యులు శాలువలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, డివిజన్ సిపిఐ సెక్రటరీ లగిశెట్టి రమేష్, సిపిఐ డివిజన్ నాయకులు శాబాద్ చిన్న సైదిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రజబెల్లి, నారపొంగు కోటయ్య, శ్రీను, రమేష్, బూరెల రాము, నిమ్మనబోయిన పాండురంగ, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు.. మంచి అలవాట్లు అలవరుచుకోవాలి

కరస్పాండెంట్స్ పుచ్చకాయల శంకర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మణుగూరు :** విద్యార్థులు చదువుతోపాటు మంచి అలవాట్లు అలవరుచు కోవాలని కరస్పాండెంట్స్ పుచ్చకాయల శంకర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం శ్రీ విద్య టెక్నో కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలతో కళకళలాడగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్‌లు పుచ్చకాయల శంకర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, క్రమశిక్షణ, సమయపాలన, గురువుల పట్ల గౌరవం వంటి విలువలు జీవితంలో ఉన్నత స్థితికి తీసుకెళ్తాయని పేర్కొన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. నృత్యాలు, పాటలు, స్కిట్లతో అందరినీ అలరించారు. చివరగా జ్ఞాపికల ప్రధానం చేసి, భావోద్వేగ వాతావరణంలో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి. నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ సారంగపాణి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎవరో?

ఉత్కంఠంగా మారిన
అభ్యర్థిత్వాల ఖరారు
ఫలితాలు తేలడంతో మంత్రి..
క్యాంపు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
కాంగ్రెస్ పార్టీ కుటుంబాలకా?
సారు చెప్పిన వారికేనా?

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ ఫలితాలలో ఒక ఏకగ్రీవ వార్డుతో పాటు ఎన్నికల ఫలితాలలో 24వార్డులు సాధించి లార్జెస్ట్ పార్టీగా కాంగ్రెస్ అవతరించింది. ఈ క్రమంలో పూర్తి ఆధిక్యతతో చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎవరనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎస్‌సి మహిళకు చైర్‌పర్సన్ రిజర్వుడు కావడం నలుగురు ఎస్‌సి మహిళా కౌన్సిలర్లు గెలుపొందడంతో ఎవరిని వరిస్తుందోనని ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం చుట్టూ ఆయా మహిళా కౌన్సిలర్ల భర్తలు, బలమైన నాయకులు తమకే అవకాశం కల్పించాలని, ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో 23వ వార్డు నుంచి గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థి పోకబత్తిని అనిత పేరు పోటీ నుంచి వినిపిస్తునే ఉంది. అలాగే ముగ్గురు మహిళా కౌన్సిలర్ల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇది ఒక ఎత్తు అయితే, వైస్ కౌన్సిలర్‌పై సైతం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎవరు పేర్లు సూచిస్తారో వారే చైర్ పర్సన్, వైస్ చైర్మన్ అవుతారనే సంకేతాలు వినిపిస్తున్నాయి.

**కీలకంగా మహిళా కౌన్సిలర్లు...**

తాజాగా ఎన్నికలలో గెలిచిన నలుగురు మహిళా కౌన్సిలర్లు ఫలితాలలో కీలకంగా మారారు. ఇందులో ఆది నుంచి కాంగ్రెస్ కుటుంబాలు కావడంతో పాటు ఉన్నత విద్యావంతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి పట్టం కట్టాలనే విషయంలోను అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. చైర్మన్ అభ్యర్థులకు కలిసి వచ్చే అంశాలను పరిగణలోకి తీసుకుంటే 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని పోకబత్తిని అనిత నామినేషన్ వేసింది మొదలు చైర్‌పర్సన్ అంటూ ప్రచారంలో ఉంది. కాగా సదరు అభ్యర్థిని గెలుపులో మారిన ప్రతికూలతలతో అధిష్ఠానం మరో మహిళా కౌన్సిలర్ అభ్యర్థి పేరును పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. అలాగే 17వ వార్డు కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమార్తి దిశగా ఆలోచన చేస్తే అవకాశం కల్పిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఇక్కడ బిఆర్‌ఎస్, సిపిఎం బలంగా ఉండటంతో పాటు పంచాయతీగా ఉన్నప్పుడు సిపిఎం సర్పంచ్ గా..బిఆర్‌ఎస్ వైస్ సర్పంచ్‌గా ఉంది. 9వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన కందుకూరి శేషమ్మ విషయానికి వస్తే భర్త కందుకూరి వెంకటనారాయణ ఆది నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాడు. అధికారం లేకపోయినా ఇక్కడి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరుపునే ప్రస్తుత మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు వెంట నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో కృషి చేసేవాడు. అలాగే 21వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన కోటమర్తి సునీత అభ్యర్థిత్వంలో బలమైన ఇక్వేషన్ కనిపిస్తుంది. వామపక్ష కోటలో గెలవడం అనుకూలతను చూపిస్తుంది. అంతేకాకుండా ఉన్నత విద్యావంతురాలు కావడం కూడా కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఇప్పటికే చైర్‌పర్సన్ ఎవరనే దానిపై చర్చ జరగుతుండగా...ఇప్పుడు వైస్ చైర్మన్ ఎవరనేదానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. తొలుత 28వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన నూకల రామ్మోహన్‌రెడ్డిని వైస్ చైర్మన్ చేస్తారనే ప్రచారం వినిపించింది.కానీ ఓడిపోవడంతో వైస్ చైర్మన్‌ను ఎవరిని చేయాలనే?అధిష్ఠానం యోచిస్తుంది. ఇందులో దివగంత నేత తమ్మినేని కృష్ణయ్య కుమారుడు తమ్మినేని నవీన్‌కు ఇవ్వడం వల్ల ఆ కుటుంబానికి న్యాయం చేసినవారమవుతామన్న ఆలోచనను చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్‌లో చేరడం, అప్పుడిచ్చిన మాట ప్రకారం ఇలా సార్థకతం చేయబోతున్నట్లు ఉహాగానాలు విపిస్తున్నాయి.

## అశ్వారావుపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా జూపల్లి శశికళ

ఒకే ఇంటిలో జోడు పదవులు
జూపల్లి మార్క్




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** నూతనంగా ఏర్పడ్డ అశ్వారావుపేట మున్సిపాలిటీలో భార్యా భర్తలిద్దరూ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులను అలంకరించనున్నారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అనుచరులైన జూపల్లి రమేష్ అశ్వారావుపేట నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీ రిజర్వేషన్ ప్రక్రియ వచ్చినప్పటి నుండి తనదైన శైలిలో మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహించారు. జనరల్ మహిళ కావటంతో భవిష్యత్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో ముందు చూపుగా చైర్మన్ అభ్యర్థి జూపల్లి శశికళ 6వ వార్డులో పోటీ చేసి విజయకేతనం ఎగరవేశారు. అదేవిధంగా 13వ వార్డులో జూపల్లి రమేష్ పోటీ చేసి సొంతం చేసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో గడపగడకు వెళ్లి ఓటర్లను ఆకట్టుకున్నారు. అదేవిధంగా మండలంలో ఆయన ప్రత్యేకమైన రాజకీయ అనుభవం కలిగి ఉన్నారు. పట్టణంలోని సమస్యలు సమగ్రంగా తెలిసిన వ్యక్తి కావడంతో మున్సిపాలిటీ ఓటర్లు ఆయకే పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా 21 మంది, సిపిఎం పార్టీ అభ్యర్థిగా ఒకరు మొత్తం 22 వార్డులకు పోటీలో నిలిచారు. మున్సిపాలిటీలో 16,580 ఓట్లు ఉండగా ఒక్కో వార్డుకు అభ్యర్థుల ఎంపిక తనదైన మార్కును ప్రదర్శించి గెలుపు గుర్రాలనే అభ్యర్థులుగా పెట్టుకున్నారు. ఆయన ప్యానల్‌లో పనిచేయడానికి అభ్యర్థులు సైతం ముందుకువచ్చారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రతిఒక్క విషయంలో ఆర్థిక లావాదేవీల్లోను అభ్యర్థులపై భారం పడకుండా తానే అంతా చూసుకుని 17వార్డులను గెలుచుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వార్డు సభ్యులుగా ఉంటే పరిపాలన విభాగం ఇబ్బందిగా ఉంటుందని, ముందుగానే గ్రహించిన ఆయన భార్య చెరొక వార్డు నుండి పోటీచేసి వారితో పాటు 15మంది గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థులతో పాటు వీరు కూడా స్పెషల్ బస్ తీసుకుని వైజాగ్ వెళ్లినట్లు తెలుస్తోంది. ముందుగా అనుకున్న విధంగా భార్య శశికళ చైర్‌పర్సన్‌గా, జూపల్లి రమేష్ వైస్ చైర్మన్‌గా 16వ తేదీన ప్రమాణ స్వీకారాన్ని చేస్తున్నట్లు తెలిసింది. ఆయనే బరిలో దిగడంతో ఇతర పార్టీ క్యాడర్ నాయకులు సైతం మౌనంగా ఉండిపోయారు. 30ఏళ్ల రాజకీయాల్లో తమదైన మార్క్‌తో పని చేసి ప్రజల్లో మంచి ఆదారాభిమానాన్ని చాటుకున్నారు. ఈ ఎన్నికలు రాజకీయాలకతీతంగా ఆయనకు సహకరించాయని చెప్పవచ్చు.

## గుమ్మడి నరసయ్యకు గౌరవ డాక్టరేట్



**ప్రజాపక్షం/కారేపల్లి :** ఆదివాసి ముద్దుబిడ్డ, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యకు గౌరవ డాక్టరేట్ లభించింది. శనివారం చెన్నై, మైలాపూర్ భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా, నిబద్ధత సేవలు అందించినందుకు గాను యూనివర్సిటీ కమిటీ గుమ్మడి నరసయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేసి సత్కరిస్తున్నట్లు పేర్కొంది. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గౌని నర్సింహా గౌడ్, నామినేషన్ కమిటీ మెంబర్ ఎండీ అరిఫుద్దీన్ చేతుల మీదుగా గుమ్మడి నరసయ్య ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు.

## హైదరాబాద్ క్యాంప్‌లో కౌన్సిలర్లు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** భలే మంచి రోజు, పసందైన రోజు.. అంటూ పా టలు పాడుతూ, నచ్చింది తింటూ ఎంజాయ్ చేస్తున్నారు కౌన్సిలర్లు. ము న్సిపల్ ఎన్నికల అనంతరం శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ అభ్యర్థులను హైదరాబాద్ క్యాంపునకు తరలించారు.. అందులో కొందరు ఎం చక్కా ఎంజాయ్ చేస్తూ ఫోటోలను వాట్సప్, ఫేస్ బుక్ గ్రూపుల్లో పెడు తూ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. చైర్మన్ అభ్యర్థి ఎవరనేది ఖరా రు కాకపోవటంతో కౌన్సిలర్లను అధిష్ఠానం క్యాంపుకు తరలించగా అక్కడ మన వాళ్లు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఫోటోలు దిగి షేర్ చేస్తున్నారు.

## 20వ వార్డు కౌన్సిలర్ విజయకుమారికి ఘనసన్మానం



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బొల్లెద్దు విజయకుమారి 95ఓట్ల మెజార్టీతో భారీ విజయాన్ని సాధించడం జరిగింది. ఈసందర్భంగా విజయం సాధించిన కౌన్సిలర్ బొల్లెద్దు విజయకుమారిని మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, 20వవార్డు అధ్యక్షులు బొల్లెద్దు రాజేంద్ర ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కౌన్సిలర్ విజయకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లి పేద, మధ్య తరగతి బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయటం వల్ల ఈఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారని అన్నారు. మధిరలోని 22వార్డులకుగాను 21 వార్డులు గెలిపించిన ప్రజలకు, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాలిక సురేష్, గౌర్రెముచ్చు లలిత, బాలస్వామి, రమేష్, గౌర్రాజు శ్రీనివాసరావు, గోపి, మేడేపల్లి అనీల్, ఆదిమూలం అరుణ, నల్లపు శ్రీనివాస్, జూపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బిసి కుల వాదం కాదు.. బిసి వాదమే: జెఎసి కన్వీనర్

**ప్రజాపక్షం/ఇల్లందు :** బిసి కుల వాదం కాదు.. బిసి వాదమేనని రాష్ట్ర బిసి సంఘాల జెఎసి కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఏక్తా హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర బిసి జెఎసి ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 24 వార్డులలో పాదయాత్ర నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రీ బిసి సంఘాల జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని జనరల్ స్థానాలకు బిసి, ఎస్టి, ఎస్సి, మైనారిటీలకు మద్దతు తెలపడం జరిగిందన్నారు. ఇల్లందులో ఓటర్లు బిసిలను ఎక్కువ శాతం గెలిపించడం సంతోషకరమన్నారు. కొన్ని వార్డులలో బిసిలు పోటీలో ఉన్నప్పటికీ కొన్ని శక్తులు వారిని అణగదొక్కేందుకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కొంత మంది స్వార్థపూరిత రాజకీయాల వల్లనే ఆ రెండు వార్డులలో ప్రచారం నిర్వహించి ప్రజల సహకారంతో వారిని ఓడించడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పోలింగ్ సమయంలో ఎన్నికల విధుల్లో ఉన్న సిఐ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాడని ఆరోపించారు. ఆ ఒక్క వార్డులో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేసి గెలవాలని ప్రయత్నాలు చేశారని, వాటిని ఓటర్లు తిప్పికొట్టారన్నారు. బిసి జెఎసిలో తాను కీలకంగా ఉన్నందునే రాష్ట్ర జెఎసి ఛైర్మన్ సూచనల మేరకు ఎన్నికల పోటీ నుండి తప్పుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో మడత వెంకట్ గౌడ్ మద్దతు తెలిపిన వారే గెలవడం సంతోషకరమన్నారు. తాను వైస్ ఛైర్మన్ అని ప్రకటించుకున్న వ్యక్తిపై స్వతంత్ర అభ్యర్థులు గెలవడం జరిగిందని, కబ్జాలు, దందాలు ఉండవద్దనే రెండు వార్డులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇల్లందు మున్సిపల్ ఛైర్మన్‌ను కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికి ఇస్తారా, పార్టీవాదం ఉన్న వారికా, డబ్బు ఉన్నవారికి ఇస్తారోనని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని తెలిపారు. వార్డులలో ఎవరికి టికెట్ ఇస్తే గెలుస్తారో అని సర్వే చేసినట్లే, ఛైర్మన్ ఎవరికి ఇస్తే అభివృద్ధి జరుగుతుందో సర్వే చేసి మంచి వ్యక్తులైన వారికే ఇవ్వాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ వాదానికి అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏక్తా హౌస్ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన అయ్యగారిపేట కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అయ్యగారిపేట కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులను మంత్రి అభినందించారు. తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి తుమ్మలను కలిసిన వారిలో చల్లగుళ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాద్, బొంతు వేణు, నాగళ్ల నాగేశ్వరరావు, నాగళ్ల రామారావు, శివ వేణు, వినుకొండ కృష్ణ, శ్రీను ఉన్నారు.

## ఘనంగా దేవాలయ కల్యాణ మండపం ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని బేతుపల్లి గంగారంలో గల 15వ బెటాలియన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దేవాలయ కల్యాణ మండపాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేవాలయ కళ్యాణ మండపం నిర్మాణం ద్వారా గ్రామ ప్రజలకు, పోలీస్ సిబ్బందికి శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మెరుగైన సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రికి కమాండెంట్ ఏ. అంజయ్య పుష్పగుచ్ఛంతో సాదరంగా స్వాగతం పలికారు. మంత్రి తుమ్మల శిలాఫలకాన్ని ఆవిష్కరించి కల్యాణ మండపాన్ని అధికారికంగా ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. మండపాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్.ఐలు రామ సత్యనారాయణ, ఉదయ్ కుమార్, ఆర్.ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార పార్టీకి ఎదురొడ్డి పోరాడి విజయం సాధించాం

సింగరేణి బొగ్గు కుంభకోణానికి వ్యతిరేకంగా
కమ్యూనిస్టు పార్టీకి మద్దతు
-విజయం సాధించిన నూతన కౌన్సిలర్లను
సన్మానించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/వైరా :** బిఆర్‌ఎస్ మిత్రపక్షాలు పొత్తులతో కలిసి అధికార పార్టీకి ఎదురొడ్డి పోరాడి విజయం సాధించామని, ప్రజలు ఒకసారి పాలించే పాత్ర ఒక సారి ప్రతిపక్ష పాత్రను ఇస్తారని ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రతో కౌన్సిల్‌లో ప్రజలు తరపున పోరాడాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. వైరా మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన బిఆర్‌ఎస్, సిపిఎం, సిపిఐ కౌన్సిల్లర్లకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి, తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, కిన్నెర కృష్ణ, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని సునీత, నల్లమోతు శైలజలను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కి ఎదురు లేదు అన్న వాళ్ళకి మనము గట్టిగా ధీటుగా పోటీ ఇచ్చామని, నేను బాధ్యత తీసుకున్న అని తెలిసి అధికార పార్టీ ఎన్ని ఎత్తులు వేసిన మన బిఆర్‌ఎస్ అభ్యర్థులు వెనకాడకుండా ఎదురు పోరాడన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల హంగ్ ఏర్పడిందని బిఆర్‌ఎస్ అభ్యర్థులు అత్యధిక స్థానాలు సాధించామని కొత్తగూడెం కార్పొరేషన్ కూడా హంగ్ రావడం వలన సింగరేణి బొగ్గు కుంభకోణానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీకి మద్దతు తెలిపామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, జిల్లా నాయకులు మంజుల మదన్‌లాల్, లకావత్ గిరిబాబు, మాజీ ఎంపిపి కృష్ణార్జునరావు, సీనియర్ నాయకులు విశ్వేశ్వర్రావు, వైరా మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు సురేష్, సిపిఎం కార్యదర్శి భూక్యా వీరభద్రం, సిపిఐ కార్యదర్శి ఎర్రాబాబు, నాయకులు నాగభూషణం, కొత్త వెంకటేశ్వర్లు, సుధీర్, కిరణ్ ప్రసాద్, దొండపాటి రమేష్, బోసు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/ మధిర :** నేటి నుండి 18వ తేదీ వరకు మధిరలోని శ్రీ మృత్యుంజయస్వామి దేవాలయం వద్ద జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్న సందర్భంలో మధిర శివాలయాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. శివాలయానికి వచ్చే భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్, వైరా నదిలో స్నానాల ఘట్టాలను తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషోర్, పట్టణ అధ్యక్షుడు రమణగుప్తా, కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, కర్నాటి రామారావు, మాగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉద్యోగాల క్యాలెండర్‌ను ప్రకటించాలి: టిజెఎస్ ప్రధాన కార్యదర్శి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఉద్యోగాల క్యాలెండర్ ను వెంటనే ప్రకటించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు సూచించారు. మండలం లోని కొత్తకొత్తూరులో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల క్యాలెండర్ ను ప్రకటించి చిత్తశుద్ధి ని నిరూపించుకోవాలని సూచించారు. అదే విధంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ రెండు వర్గాల ఆగ్రహానికి గురికావద్దని సూచించారు. పురపాలక ఎన్నికలలో కాంగ్రెస్ కు పట్టం కట్టారని పేర్కొన్నారు. తాముసంపూర్ణ మద్దతు ఇచ్చి గెలుపుకు సహకరించినట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డి పాలన కు రెఫరెండం అన్నారు. బీఆర్ఎస్ కు గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. టీజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరామ్ పై మాజీ ఎమ్మెల్సీ కవిత అవాకులు, చివాకులు పేలటం మానుకోవాలని సూచించారు. కోదండరామ్ ను విమర్శించే స్థాయి ఆమె కు లేదన్నారు. తీరు మారకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే జిల్లాలలో అన్ని కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. నేలకొండపల్లి లో జరిగినపాలేరు డివిజన్ సదస్సు ను విజయవంతం చేసినందుకు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా నాయకులు బీ.రాజేందర్ నాయక్, మాదాసు శ్రీనివాసరావు, గుగులోత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శన్‌రెడ్డిని కలిసిన కౌన్సిలర్లు



ప్రజాపక్షం/భీమ్‌గల్ : మున్సిపల్ 2వ విడత సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు శనివారం బోధన్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నాగేష్‌రెడ్డి ఎమ్మెల్యేను కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపి కాంగ్రెస్ పార్టీని నమ్మి విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నూతన కౌన్సిలర్లు సంటి లత, ఆరెపల్లి శ్రీజ, పర్శ లత, తోట సతీష్, బోదిరే నాగమణి, అంజుమ్ అలీ, సందీప్, సంగ్యా నాయక్‌లతో పాటు మండల అధ్యక్షులు స్వామి, పట్టణ అధ్యక్షులు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, శ్రీనివాస్ ఉన్నారు.

## ముల్కల్ల గోదావరి వద్ద జాతర ఏర్పాట్ల పరిశీలన



ప్రజాపక్షం/మంచిర్యాల : హాజీపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోగల ముల్కల్ల గోదావరి పరివాహక ప్రాంతాన్ని శనివారం హాజీపూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ సందర్శించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుండి గంగాస్నానం కోసం వచ్చే భక్తులు లోతట్టు ప్రాంతానికి వెళ్ళకుండా స్నానం ఆచరించాలని కోరారు. అదేవిధ,గా భక్తులు అక్కడ స్వామివారిని దర్శించుకోవడంతో పాటు స్నానఘట్టాల దగ్గర సౌకర్యాల ఏర్పాట్లుకై ముల్కల్ల ప్రత్యేక అదికారితో కలిసి పనులను పర్యవేక్షించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ కోసం తమ సిబ్బందిని కూడాఅక్కడ అందుబాటులో ఉండటం జరుగుతుందన్నారు. శివరాత్రి వేడుకలు ప్రతీ ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని గోదావరిలోపల నీటి లోతు ఎక్కువగా ఉన్న వైపు వెళ్ళకుండా భక్తులు సహకరించాలని కోరారు.

## మహాశివరాత్రికి పటిష్ఠ బందోబస్తు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రధాన శివాలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందసుగా భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి .జానకి షర్మిల తెలిపారు.ఈ పర్వదినం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.ముఖ్యంగా జిల్లాలోని కదిలే పాపహరేశ్వర స్వామి దేవాలయం,బాబాపూర్,బూరగుపల్లి రాజరాజేశ్వర స్వామి దేవాలయాలు,దస్తురాబాద్ మండలంలోని శివాలయం,నిర్మల్ పట్టణంలోని వెంకటాద్రిపేట,శివకోటి మందిరం,నగరేశ్వర వాడ వంటి ప్రధాన ఆలయాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ వెల్లడించారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు,మహిళలు,వృద్ధుల కోసం ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.దేవాలయ పరిసరాల్లో నిరంతరం పోలీస్ పహారా ఉంటుందని,ప్రతి కదిలికను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని ఎస్పీ జానకీ షర్మిల స్పష్టం చేశారు.భక్తులు క్రమశిక్షణతో దర్శనాలు చేసుకుని పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

## 16న ప్రజావాణి రద్దు

ప్రజాపక్షం/ సంగారెడ్డి : ఈ నెల 16న సోమవారం నాడు నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున సోమవారం నాడు నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## అంబరాలను అంటిన సంబరాలు



ప్రజాపక్షం/ సంగారెడ్డి : జోగిపేట చౌరస్తా లోని మహాత్మా బసవేశ్వర స్వామి ,బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి మున్సిపాలిటీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన సందర్బంగా పార్టీ కార్యకర్తలతో విజయోత్సవ ర్యాలీ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీలోని మొత్తం 20 వార్డులలో తొలిసారిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వంలో 16 వార్డులలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించి చరిత్ర సృష్టించిన సందర్బంగా భాణాసంచా కాల్చి ,డప్పులతో పార్టీ కార్యకర్తలు డ్యాన్స్‌ల చేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ర్యాలీలో కార్యకర్తల సంబరాలు, ఆనందత్సవాలు మిన్నంటాయి. భారీ ర్యాలీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాదించడంలో కార్యకర్తలకు ముఖ్య నాయకులు అభ్యర్థులను అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలకు 25 సైకిళ్ల పంపిణీ

ప్రజాపక్షం/మాక్లూర్ : మానిక్‌భండార్ జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు 25 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. డీఈఓ అశోక్ పాల్గొని బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ సత్యనారాయణ బెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. సభ్యులై సతీష్, గౌతమి, చిరంజీవి, కిషోర్ డీఈఓను ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రజినీ, గంగాధర్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# 'బిసి'కి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి

### పంచరెడ్డి లలిత,ఉమారాణి పేర్లు తెరపైకి
### ఎంఐఎంతో కాంగ్రెస్ దోస్తీకి సిద్ధం
### డిప్యూటీ మేయర్ ఎంఐఎం పార్టీకి



ప్రజాపక్షం/నిజామాబాద్ : నిజామాబాద్ కార్పొరేషన్‌లో మేయర్ పదవి కాంగ్రెస్ పార్టీకి దక్కే మార్గం సుగమమైందని చెప్పాలి. బీజేపీ మేయర్ పదవి రేస్‌లో ఉండటం లేదన్న నిర్ణయం స్వయంగా ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రతిపక్షంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని ఎప్పటికప్పుడు సమస్యలను ఎత్తి చూపుతూ ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పటంతో మేయర్ పీఠంపై నెలకొన్న సందిగ్ధం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా ఎంఐఎంఎతో కాంగ్రెస్ దోస్తీకి అన్ని సిద్ధం చేస్తుంది. మద్దతు ఇస్తే డిప్యూటీ మేయర్ ఎంఐఎం పార్టీకి ఇవ్వాలని ఆలోచనలో ఉందట. కాగా ఎలక్షన్ ప్రారంభం నుంచి మేయర్ అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్ 19వ డివిజన్ అభ్యర్థి తక్కువ ఓట్లతో ఓడిపోవటంతో కాంగ్రెస్ పార్టీలో ఎవరిని మేయర్ పీఠం వరిస్తుందోనన్న ఉత్కంఠ తెరపైకి వచ్చింది. మహిళా జనరల్‌కు కేటాయించటంతో ఎవరు కూడా జనరల్ అభ్యర్థులు లేక పోవటంతో ఎవరికి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ తర్జనభర్జనలో ఉన్నట్లు తెలుస్తుంది. జనరల్ మహిళకు బదులు బీసీ సామాజిక వర్గానికి ఇస్తే కూడా బీసీ వాదాన్ని కూడా గెలిపించిన క్రెడిట్ కాంగ్రెస్ పార్టీ తమ ఖాతాలో వేసుకునే అవకాశం వచ్చింది. కాంగ్రెస్ నుంచి మొత్తం 17 మంది కార్పోరేటర్లు గెలువగా అందులో నుంచి ఎవరిని ఎంపిక చేయాలన్నది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారింది. నగర మేయర్, డిప్యూటీ మేయర్, ఎంఐఎంతో పాటు పొత్తు విషయమై సిఎం రేవంత్‌రెడ్డితో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం అత్యవసరంగా భేటీ అయినట్లు తెలుస్తుంది. కార్పోరేషన్‌లో 41వ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన పూజిత గౌడ్, 9వ డివిజన్ నుండి గెలుపొందిన కేతావత్ సురేఖ, 12వ డివిజన్ నుంచి గెలుపొందిన అరుంధతి, 21వ డివిజన్ నుంచి విజయం సాధించిన పంచరెడ్డి లలితలు, 33వ డివిజన్ నుండి గెలిచిన పర్వాఖాన్ 49వ డివిజన్ కూరగాయల ఉమారాణి 59వ డివిజన్‌కు చెందిన రఫత్ పర్వీన్ 61వ డివిజన్‌లో గెలుపొందిన అసరా నజ్రీన్‌లు మేయర్ పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. కార్పోరేషన్ మహిళా జనరల్ కావటంతో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన మహిళ కార్పోరేటర్లు ఎవరికి వారు తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. హైకమాండ్ ఎవరి వైపు మొగ్గు చూపుతోందనేది ఆసక్తికరంగా మారింది. ఈనెల 16న జరగనున్న మేయర్ ఎన్నికల్లో అభ్యర్థిని పేరును సీల్డ్ కవర్‌లో ప్రకటించే అవకాశాలున్నాయి. గతంలో కూడా బీఆర్‌ఎస్ నుంచి ఒక అభ్యర్థి పేరు ప్రకటించి తర్వాత షీల్డ కవర్‌లో మరో అభ్యర్థి పేరు ఖరారు చేసిన విషయం అందరికి తెలిసిందే. అందుకని చివరి వరకు మేయర్ అభ్యర్థిని పేరు రహస్యంగా ఉంచేలా కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తుందని పార్టీలో చర్చ నడుస్తుంది. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆశీస్సులు ఎవరికి ఉంటే వారే మేయర్ పీఠంపై కూర్చుండే అవకాశాలు లేక పోలేదని ఆయన ఎవరికి మద్దతు ఇస్తారో ఎవరిని మేయర్ పీఠంపై కూర్చోబెడతారో వేచి చూడాల్సిందే. **పంచరెడ్డి లలిత చరణ్ :** 21వ డివిజన్ నుంచి పంచరెడ్డి లలిత భర్త చరణ్ విద్యార్థి నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవ కార్యక్రమాలతో పాటు నగరంలో బీసీ మున్నూరుకాపు సామాజిక వర్గం బలమైన ఓటు బ్యాంకుతో పాటు ఇప్పటివరకు ఈ సామాజిక వర్గానికి ఎలాంటి కీలక పదవులు ఇవ్వకపోవటంతో వచ్చిన అవకాశం వీరికి మేయర్ పదవి దక్కనుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు పార్టీ పెద్దలు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధర్మపురి సంజయ్ అండదండలు కూడా ఉన్నాయని చరణ్ సోదరుడు పంచరెడ్డి శ్రీకాంత్ సైతం ఇటీవల జరిగిన ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో అధ్యక్షులుగా గెలుపొందటంతో రాజకీయ నాయకుల అండదండలున్న పంచరెడ్డి కుటుంబానికి మేయర్ పదవి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. **49వ డివిజన్ ఉమారాణి :** ఉమారాణి భర్త కరాటే రమేష్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్నిహితులుగా ఉంటూనే పార్టీ కోసం సేవలందించారు. ముదిరాజ్ కులానికి చెందిన వారికి ఇప్పటివరకు ఎలాంటి ముఖ్యమైన పోస్ట్ ఇవ్వకపోవటంతో పాటు ముదిరాజ్‌లకు ఇస్తే పార్టీకి కూడా పేరు వస్తుందని ఆలోచించే అవకాశాలు లేక పోలేదని వినిపిస్తున్నాయి.



# ఖానా'పుర' చైర్మన్ పీఠం ఎవరికి దక్కేను?

### పీఠం దక్కాలంటే ప్రధాన పార్టీలకు ముగ్గురు కౌన్సిలర్‌ల మద్దతు తప్పనిసరి

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికపై తీవ్ర ఉత్కంట నెలకొంది.పట్టణ ఓటర్లు ఏ పార్టీకి సరైన మెజార్జీ ఇవ్వకపోవడంతో హంగ్ ఏర్పడింది.ఇక్కడ ప్రజల విలక్షణ తీర్పుతో చైర్మన్ పీఠం తమదంటే తమదంటూ ప్రధాన పార్టీల నేతలు ఎవరికి వారు ప్రయాత్నాలు చేస్తున్నారు.దీంతో ఆయా పార్టీల నేతలు తమ కున్నా సంఖ్య బలంతో పాటు ఆదనంగా మరో ఇద్దరు లేక ముగ్గురు అభ్యర్థులు ఉంటే తప్ప చైర్మన్ ఎన్నిక అయ్యేలా లేదు.అధికార కాంగ్రెస్ పార్టీకి చైర్మన్ ఎన్నిక సవాల్‌గా మారినట్లు తెలుస్తుంది.దీంతో ఆయా పార్టీలు పట్టువిడువుతో ఎలాగైనా చైర్మన్ పదవి కైవసం చేసుకునేందు కు మూడు రోజులుగా రాజకీయా ప్రయాత్నాల్లో నిమగ్న మయ్యారు. దీంతో ఎప్పటికప్పుడు తమ తమ అదిష్టానతో ఆయా పార్టీల నాయకులు చర్చలు సాగిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన అంతుబట్టని తీర్పుతో బీఆర్ఎస్,బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు అయోమయంలో పడ్డాయి.బీఆర్ఎస్‌కు 4,బీజేపీకి 4,కాంగ్రెస్ కు 3,స్వతంత్ర అభ్యర్థితో కలిసి 4 స్థానాలు ఉన్నాయి.ఏ పార్టీకి సరైన మెజార్టీ లేక ఆయా పార్టీలు ఎలాగైనా మున్సిపల్ చైర్మన్ ప దవిని కైవసం చేసుకునేందుకు క్యాంపు రాజకీయాలకు పాల్పడుతూనే చైర్మన్ ఎన్నికకు కావల్సిన సభ్యుల మద్దతు కూడగట్టుకునే రాజకీయా ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజార్టీ ఎవరికి రాకపోవడంతో బీఆర్ఎస్,కాంగ్రెస్ మధ్య ఘర్షణలు వాతావరణలు చేసుకున్నాయి. అలాంటి సంఘటనలను సమాచారం మేరకు ఖానాపూర్ లో గట్టి బందోబస్తుకు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.




మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఏ పార్టీకి సరిపడా కోరం లేకపోవడంతో ఆయా పార్టీలు ఎక్స్ ఆఫీసియో మెంబర్లను ఎమ్మెల్యే, ఎంపీతో పా టటు ఎమ్మెల్సీలు,చైర్మన్ ఎన్నికకు హాజరై మ ద్దతు ఇచ్చే అవకాశం ఉంది,ప్రమాణ స్వీకార ంతో పాటు చైర్మన్ ఎన్నిక జరిగే అవకా శం ఉంది.ఏదైనా కారణం చేత లేదా కోరం లేక చై ర్మన్ ఎన్నిక వాయిదా పడితే తిరిగి మరుసటి రోజు ఎన్నిక జరుపే అవకాశం ఉందని తెలుస్తుంది.

## వశిష్ట డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ పుస్తక ఆవిష్కరణ

### విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ పిలుపు..




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్ రచిందచిన ''A COMPANION TO ENGLISH FOR BRILLIONCE'' అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని శనివారం కళాశాల డైరెక్టర్ వి.సత్యనారాయణ గౌడ్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ పుస్తకం ముఖ్యంగా డిగ్రీ సెకండ్ సెమిస్టర్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించబడింది.విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టుపై మంచి పరిజ్ఞానాన్ని అందించడానికి అత్యంత సరళమైన భాషలో ఈ పుస్తకాన్ని రచించిన అఖిలేష్ కుమార్‌సింగ్‌ను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో ఈ పుస్తకాన్ని చదువుకొని సబ్జెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, తద్వారా డిగ్రీ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు కావడానికి ఇది ఎంతో దోహదపడుతుందని ఆయన ఆకాంక్షించారు.ఈ చక్కని అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆదర్శ ప్రాయురాలు రాజమ్మ

### రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్



ప్రజాపక్షం/ఎడపల్లి: సమాజంలో అసమానతల తొలగింపు కోసం, నూతన సమాజ స్థాపన కోసం పోరాడే ఓ ఉద్యమ నాయకుడిని అందించడమే కాకుండా, మరణానంతరం తన కళ్లను, శరీరాన్ని మెడికల్ ఆస్పత్రికి దానం చేసిన బందారి రాజమ్మ అందరికీ ఆదర్శ ప్రాయురాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ కొనియాడారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో పార్టీ బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో బి.మల్లేష్ మాతృమూర్తి బందారి రాజమ్మ సంతాప సభ నిర్వహించారు. రాజమ్మ తన కుమారుడు మల్లేష్ పార్టీలో చేరి ప్రజా సేవలందిస్తున్నప్పుడు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా ప్రోత్సహించారని, ఆ మద్దతు వల్లే మల్లేష్ నేడు సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగారని ప్రభాకర్ పేర్కొన్నారు. మరణం తరువాత కూడా తన రెండు కళ్లను దానం చేసి ఇద్దరికీ చూపునివ్వడం, తన పార్థీవ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించి కాబోయే డాక్టర్ల చదువుకు ఉపయోగడం ఆమెలోని సామాజిక స్పృహకు నిదర్శనమని నాయకులు నివాళులు అర్పించారు.

# ఇండ్లలో నివసించకపోతే 'డబల్ బెడ్ రూమ్' రద్దు

### అర్హులైన ఇతరులకు కేటాయింపు
### హౌసింగ్ కార్పోరేషన్ గౌతం



ప్రజాపక్షం/ సంగారెడ్డి : డబల్ బెడ్ రూం ఇండ్లలో లబ్దిదారుల నివసించకపోతే వాటి కేటాయింపు ను రద్దు చేసి అర్హులైన ఇతరులకు మంజూరు చేస్తామని హౌసింగ్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ స్పష్టం చేశారు. వివిధ దశల్లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పటాన్‌చెరు అసెంబ్లి నియోజకవర్గంలోని పలు డబల్ బెడ్ రూం కాలనీలను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. హౌసింగ్ కార్పోరేషన్ కార్పోరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం చైతన్య కుమార్ సంగారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ సి చలపతిరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవీందర్ ,డి.నర్సయ్య, తదితరులతో కలిసి కర్దనూర్ ,పోచారం ,అమీన్‌పూర్ రామేశ్వరం బండ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా కాలనీల్లోని స్థితిగతులను తెలుసుకున్నారు. తొలుత కర్దనూర్‌లో సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ 140 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కాలనీలోని పనులన్ని నెల రోజుల్లో పూర్తి చేసి నివాస యోగ్యంగా తీర్చిదిద్దాలని సంబందిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మొదటి పేస్‌లో పూర్తి చేసి లబ్దిదారులకు కేటాయించిన 540 ఇండ్ల కాలనీనీ ఆకస్మికంగా తనిఖీ చేసి లబ్దిదారులే నివస్తున్నారా అనే అంశంపై సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇక్కడ చాలమంది నివసించడం లేదని వారు రాకుంటే రద్దు చేస్తామని స్పష్టం చేస్తూ ఇకపై ఆకస్మికంగా తనిఖీలు చేస్తామన్నారు. స్థానికులతో మాట్లాడుతూ వెల్ఫేర్ అసోసియేషన్ వార సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించుకోవడం పట్ల అభినందించారు. పోచారంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో సుమారు 62 కోట్ల అంచనా వ్య యంతో నిర్మిస్తున్న 720 ఇండ్ల నిర్మాణపు పనుల ను పరిశీలించారు. ఈ పన్నులన్నీ వచ్చే నెలలో పూర్తి కానున్న నేపథ్యంలో పాఠశాలలు ,అంగన్‌వాడి, సెంటర్ క మ్యూనిటీహాల్ వంటిని కూడా నిర్మించాలని అధికారులకు సూచించారు.దీనిపై స్పందిస్తూ ఇండ్ల కేటాయించిన వారికి ఇక్కడే నివాసం ఉండటానికి ఇష్టపడకపోతే రద్దు చేసి ఇండ్లు కావాలని వేచి చూస్తున్న ఇతర పేదలకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అందరికి అర్థమయ్యేలా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రామేశ్వరం బండలోని జేఎన్ఎన్‌యు ఆర్ ఎం కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# సంగారెడ్డి, సదాశివపేట ఓటర్లకు కృతజ్ఞతలు

### ఎమ్మెల్యే చింతాప్రభాకర్

ప్రజాపక్షం/ సంగారెడ్డి : సంగారెడ్డి ,సదాశివపేట మున్సిపాలిటీల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి బలపరిచిన అభ్యర్థులకు ఓటేసి ఆశీర్వదించిన ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తెలిపారు. ఈ సందర్బంగా ఇచ్చిన హామీల మేరకు రూ. 512 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు పాల్పడినా అధికార దుర్వినియోగానికి దిగినా ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి గణనీయమైన స్థానాలు ఇచ్చారు. ఇందుకు మరోసారి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆహార్నిశంలు శ్రమించిన బిఆర్ఎస్ కార్యకర్తలకు తెలంగాణ ఉద్యమ కారులకు ,నాయకులకు ప్రత్యేక దన్యవాదాలు తెల్పిపారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలకే కాకుండా నియోజకవర్గంలోని గ్రామాల నుంచి వచ్చిన ప్రతి నాయకుడు ,కార్యకర్త నిస్వార్థంగా కృషి చేశారన్నారు. ప్రతి వార్డుకు రూ. 8 కోట్ల ప్రత్యేక నిధులు ఇస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం వెంటనే సంగారెడ్డి పట్టణానికి రూ. 304 కోట్లు, సదాశివపేట పట్టణానికి రూ. 208 కోట్లు, మొత్తం రూ. 512 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రెండు పట్టణాల్లో పేదల కోసం పది వేల ఇండ్ల స్థలాలు పది వేల ఇందిరమ్మ, ఇండ్లు మంజూరు చేయాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హా యాంలో ప్రారంబించిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వారి భా ద్యత



సంగారెడ్డి ని యోజక వర్గ ప్రజల తరపున వారి ఎమ్మెల్యేగా నేను కాంగ్రెస్ నాయకులు హామీలు అమలు చే యాలని గట్టిగా కోరుతున్నాన్నారు. ఇవే కా కుం డా పెన్షన్లను రూ. 4వేల వరకు పెంచాలని, కళ్యాణ లక్ష్మి పథకంతో పాటు తులం బం గారం ఇవ్వాలని, మహిళలకు ప్రతి నెల రూ. 2,500 వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ,రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు అందించాలని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని మరోసారి డిమాండ్ చేశారు.

## గులాబీ గూటికి ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు

### పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన గూడెం ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ పటాన్చెరు : ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ ల్లో స్వతంత్రులుగా గెలిచిన ఇద్దరు కౌన్సిలర్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఇస్నాపూర్ మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ ఎల్లకొండ రాహుల్‌రెడ్డి, ఇంద్రేశం, మున్సిపల్ 2 వవార్డు కౌన్సిలర్ సార లావణ్యాకు గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ అధ్యక్షులు కేసిఆర్ మార్గదర్శకత్వంలో తన నాయకత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు కౌన్సిలర్లు తెలిపారన్నారు.కార్యకర్తల కృషితో పటాన్చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ అధికారం చేపట్టనుందని సంతోషం వ్యక్తం చేశారు.

# ఏడుపాయల జాతరకు భారీ బందోబస్తు



ప్రజాపక్షం/పాపన్నపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 15 నుండి 17 వరకు మూడు రోజుల పాటు జరిగే ఏడుపాయల వనదుర్గ మాత జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ తెలిపారు. జాతర ప్రాంగణం మొత్తం సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచినట్లు, భక్తుల భద్రత దృష్ట్యా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకుని వెళ్లేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తులు అనుమానాస్పద వస్తువులను తాకవద్దని, పోలీసు సిబ్బంది సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. క్యూలైన్స్ తప్పనిసరిగా పాటించాలని, బారికేడ్స్ దాటి రాకూడదని అన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని కోరారు. విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. గొడవలు, తగాదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, షీ టీమ్స్, మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ టీమ్స్‌ను మోహరించినట్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రాత్రి వేళల్లో మఫ్టీ పార్టీలు, క్యూఆర్‌టీ పార్టీలతో, ఫుట్ పెట్రోలింగ్ ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు. దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భక్తులు నీటి లోతు తెలియని ప్రదేశాల్లోకి వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఏడుపాయల జాతర బందోబస్తును జిల్లా ఎస్పీ గారి స్వీయ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బందోబస్తులో ఒక అదనపు ఎస్పీ, 4గురు డీఎస్పీలు, 19 మంది సీఐలు, 66 మంది ఎస్ఐలు, 150 మంది ఏఎస్ఐలు/ హెడ్ కానిస్టేబుళ్లు, 220 మంది కానిస్టేబుళ్లు, 120 మంది మహిళా పోలీసు సిబ్బంది, 266 మంది హోంగార్డులు, బీడీటీమ్స్, 9స్పెషల్ పార్టీలు కలిపి సుమారు 900 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. జాతర ప్రాంతాన్ని 4 సెక్టార్లుగా విభజించి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు, భక్తుల వాహనాల కోసం పా ర్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పో లీసు వారి సూచనలు పాటిస్తూ, పోలీసు సిబ్బందికి సహకరించి ఈ ఉత్సవాన్ని ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పి కోరారు.

## స్వామివారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన కలెక్టర్



ప్రజాపక్షం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానంలోని ఆవరణలో శనివారం శివ కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేదపండితులచే నిర్వహించారు. స్వామివారి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సతీసమేతంగా సమర్పించారు. స్వామి వారి భక్తులు శివనామ స్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వి.అనూష, తహశీల్దార్ వాహిదుద్దీన్, ఎస్ఐ గీత, ఎంపిడివో సలీం, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, సర్పంచులు కొలపాక రాధ రాజు, ఆకుల రమేష్, చేకూట శేఖర్, మాజీ ఎంపిపి కోల జమున శ్రీనివాస్, మాజీ సర్పంచులు బొడ్డుపల్లి రాజన్న, ఆకుల జమున రాజారెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఉప సర్పంచులు మైదం ప్రభాకర్, ప్రశాంత్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సిఎం కప్ జిల్లా పోటీలు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా స్థాయి సీఎం కప్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ క్రీడా పోటీలు అంబేద్కర్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్లో వివిధ క్రీడాంశాలు నిర్వహించారు గెలుపొందిన విజేతలకు ట్రోఫీతో పాటు పథకాలు ఇవ్వడం జరిగింది. జిల్లా స్థాయిలో జరిగిన టోర్నమెంటులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారు హ్యాండ్ బాల్ మొదటి స్థానం బాలుర విభాగం రామడుగు మండలం కబడ్డీ మహిళా విభాగంలో కరీంనగర్కు మొదటి స్థానం లభించింది. కోకో మొదటి స్థానం మహిళా విభాగం నుండి చొప్పదండి కవసం చేసుకుంది. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో ఈనెల 17 నుండి 23 వరకు వివిధ జిల్లాలో జరిగే టోర్నమెంట్లో పాల్గొంటారు. కరీంనగర్ జిల్లాను రాష్ట్రస్థాయి పోటీలలో అగ్రగామిగా నిలవాలని, డివైస్ ఓబి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇందులో టీఎస్ పేట సంఘం జిల్లా అధ్యక్షులు బాబు శ్రీనివాస్, కార్యదర్శి టీజీపేట జిల్లా అధ్యక్షులు అంతటి శంకరయ్య, కార్యదర్శి చిరుత శ్రీనివాస్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోదావరి నదిలో మృతదేహం లభ్యం



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నదిలో శనివారం గుర్తుతెలియని మగ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.మృతుడి వయస్సు 45 నుండి 50 సంవత్సరాలు ఉంటుందని ఒంటిపై నలుపు రంగు బనియన్, గోధుమరంగు నిక్కరు ధరించి ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు మృతి



ప్రజాపక్షం/వీణవంక: కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన గట్టు ఐలయ్య (50) శనివారం ఉదయం తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. వృత్తి రీత్యా ఐలయ్య తాటిచెట్టు ఎక్కే క్రమంలో మోకు జారి ప్రమాదవశాత్తు కిందపడడంతో ఐలయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి బార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుని కొడుకు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## 'కోరుట్ల' రేసులో ఆరుగురు




ప్రజాపక్షం/కోరుట్ల : కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు నేతృత్వంలో కోరుట్లలో కాంగ్రెస్ పార్టీ విజయఢంఖ మ్రోగించింది మొత్తం 33 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 18 స్థానాల్లో గెలుపొంది మ్యాజిక్ ఫిగర్ అందిపుచ్చుకుంది. జువ్వాడి నరసింగరావు తన అధిపత్యపరును అందిపుచ్చుకున్నారు.ప్రత్యర్థి పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి, పార్టీలు తమ పట్టు ఉన్న వార్డులో కూడా తమ ప్రభావాన్ని చూపలేకపోయారు. ప్రజల ఆశీర్వాదంతో తమ పట్టును సాధించిన జువ్వాడి వర్గం. కోరుట్ల మున్సిపల్ చైర్మన్ పదవి కోసం సాగుతున్న రాజకీయ చర్చలు కోరుట్ల పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారాయి. చైర్మన్ రేసులో పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ,అనుభవం–నిబద్ధత–ప్రజాసేవ అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఇద్దరు మాజీ చైర్మన్లు రేసులో ఉండడం గమనార్హం.*ప్రధానంగా చైర్మన్ అభ్యర్థులుగా*తిరుమల వసంత గంగాధర్,శీలం జయలక్ష్మి వేణుగోపాల్,అన్నం లావణ్య అనిల్,పుప్పాల ఉమాదేవి ప్రభాకర్,సొగ్రాబీ,యాటం పద్మ (చిట్టిబాబు)పేర్లు వినిపిస్తున్నాయి. జువ్వాడి నరసింగరావు, కాంగ్రెస్ అధిష్టానం ఎవరిని కోరుట్ల మున్సిపల్ చైర్మన్ గా నిర్ణయిస్తుందో వేచి చూడాల్సిందే అని కోరుట్ల ప్రజలు,కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

# ధర్మపురి 'పుర' అధ్యక్ష పీఠం ఎవరిదో?



ప్రజాపక్షం/ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలికలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. 15 వార్డులకు గాను 15 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచి ప్రతిపక్షం అనేది లేకుండా సగర్వంగా బల్దియాలో అడుగుపెట్టనుంది. నూతన పాలకవర్గం ఈనెల 16న కొలువుదీరనుంది. అయితే ఈసారి ధర్మపురి పుర అధ్యక్ష స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో మొన్న జరిగిన ఎన్నికల్లో ధర్మపురి లోని ప్రముఖ నాయకులందరూ తమ తమ సతీమణి లేదా బంధువర్గంలోని మహిళా అభ్యర్థులను బరిలో దింపారు. ఎన్నికలు పూర్తయి ఫలితాలు వెల్లడి కావడం అధికార కాంగ్రెస్ పార్టీ తరుపున గెలుపొంది అధ్యక్ష పీఠం కోసం ముగ్గురు ఆశావహులు పోటీపడుతుండటం అందరినీ ఆసక్తికి గురిచేస్తోంది. ముఖ్యంగా ధర్మపురి కాంగ్రెస్ పార్టీలో మొదటినుండీ కొనసాగుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందిన పార్టీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు సంగనబట్ల దినేష్, వేముల రాజేష్‌ల సతీమణులు చైర్ పర్సన్ స్థానాన్ని కోరుతున్నారు. వీరిలో దినేష్ సతీమణి సంతోషి, రాజేష్ సతీమణి నాగలక్ష్మి ఇరువురూ గత పాలకవర్గంలోనూ వుండి సమస్యలపై బిఆర్ఎస్ పాలక వర్గంతో పోరాడారు. రాజేష్ సతీమణి నాగలక్ష్మి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ గానూ వ్యవహరించారు. రిజర్వేషన్ కలిసివస్తే వచ్చే ఎన్నికల్లో నాగలక్ష్మి చైర్ పర్సన్ కావడం లాంఛనమేననే ప్రచారం అప్పుడు కొనసాగింది. అయితే గతంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, గత మున్సిపల్ ఎన్నికల్లో బీసీ మహిళకు రిజర్వు కావడంతో అధ్యక్ష పీఠానికి దూరమైన ఓసీ అభ్యర్థులు ఈసారి జనరల్ మహిళకు చైర్మన్ పీఠం కోసం అవకాశం రావడంతో ఓసీ వర్గానికి చెందిన సంతోషి సైతం పీఠాన్ని ఆశిస్తున్నారు. అదేవిధంగా మొన్నటి ఎన్నికల్లో అత్యంత కీలక పోరుగా అందరి దృష్టిని ఆకర్షించి 11వ వార్డు నుండి ఘనవిజయం సాధించిన ఓసీ వర్గానికి చెందిన జక్కు పద్మ అవకాశం వస్తే చైర్ పర్సన్ స్థానానికి గట్టి పోటీదారులుగా ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల వార్‌ను తనదైన శైలిలో వన్ సైడ్‌గా మార్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు పుర అధ్యక్ష పీఠం ఎంపిక సవాల్ విసురుతోంది. దీనిపై మంత్రి వివరిస్తూ కాంగ్రెస్ నాయకులు అందరూ ఒక కుటుంబంలా కలిసి ఉంటారని, అంతర్గతంగా చర్చించుకుని మూకుమ్మడిగా చైర్ పర్సన్ అభ్యర్థిని ఎంపిక చేసుకుంటామని తెలిపారు. అధ్యక్ష పీఠం ఎవరిదో ఈనెల 16 వరకూ సస్పెన్స్ కొనసాగనుంది.

## మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి: ఎసిపి

ప్రజాపక్షం/హుస్నాబాద్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలం లోని మరో వేములవాడగా పిలువబడే పొట్లపెల్లి లోని స్వయంభూ రాజారాజేశ్వరా ఆలయంలో, పట్టణంలోని మరకత లింగేశ్వర ఆలయం, సిద్దేశ్వరాలయంలో ఏర్పాట్లును ఆలయ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. పొట్లపెల్లికి వచ్చె భక్తుల సౌకర్యం కోసం పలువ పందిళ్లు, మెడికల్ క్యాంపు, మంచి నీటి సౌకర్యం, ప్రత్యేక విద్యుత్ అలంకరణతో శోభయాణంగా ఏర్పాట్లు చేశారు. హుస్నాబాద్ నుండి ప్రతి 30 నిమిషలకు ఒక బస్సు చొప్పున బస్సు సౌకర్యాం ఏరాట్లు చేశారు. మూడు చోట్ల పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలకు ఏలాంటి విఘాతం కలుగకుండ 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చేశారు. ఆదివారం ఉదయం 5 గంటలకు అభిషేక కార్యాక్రమంతో మొదలై సాయంత్రం 7గంటల వరకు భజనకార్యక్రమం, 9 గంటలకు శివపార్వతుల కళ్యాణం 12 గంటలకు లింగోద్భవం శివునికి అభిషేకం అలంకరణ తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. భద్రత ఏర్పాట్లును ఏసిపి సదానందం, ఆలయ ఇఒ కిషణ్‌రావు, శ్రీనివాస్‌తో పాటు కమీటి సభ్యులు పాల్గొన్నారు.



## మహా శివరాత్రికి శివాలయాలు ముస్తాబు



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో శివాలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాలలోని ప్రముఖ శివాలయాలను ఆలయ కమిటీలు భక్తుల సౌకర్యం కోసం ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కాగా మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు మూడు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ భక్తబృందం ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసింది. అలాగే తిగుల్‌లోని పార్వతిపరమేశ్వరుల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు స్థానిక సర్పంచ్ రజిత పర్శరాం ఆధ్వర్యంలో ఆలయం వద్ద విద్యుత్ దీపాలు, రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారు.

# ప్రతీ హామీని నెరవేర్చుతాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి వారిని శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు గాను 15 వార్డుల్లో ఘన విజయం సాధించామని మంత్రి అన్నారు.ధర్మపురి నియోజకవర్గ ఓటర్లు 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తనను గెలిపించాక గడిచిన రెండు సంవత్సరాలలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం తోపాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.మొన్నటి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించిన ఓటర్లు నిన్నటి మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థులను నూరు శాతం తో గెలిపించడం ఆనందం కలిగించిందని అన్నారు.ఓటర్లు ఇచ్చిన తీర్పుతో తమపై మరింత భాధ్యత పెరిగిందని ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ చెప్పారు.వెంట నాయకులు బాధినేని రాజేందర్, సింహరాజు ప్రసాద్, ఎస్.నరేందర్, స్తంభంకాడి రమేష్, ఎండీ. షబ్బీర్ తదితరులు ఉన్నారు.

**మున్సిపల్ విజయంలో మంత్రి అడ్లూరి కీలకపాత్ర:** రెండవ సాధారణ పురపాలిక ఎన్నికల్లో ధర్మపురి మున్సిపాలిటీ లోని 15 వార్డులకు 15 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొంది క్లీన్ స్వీప్ చేయడంతో ఇంతటి ఘనవిజయం ఎలా సాధ్యమైందనే చర్చ అంతటా జోరుగా సాగుతోంది. ఈ గెలుపు ఘనత ముమ్మాటికీ స్థానిక ఎమ్మెల్యే, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ధర్మపురి బల్దియాలోని 15 వార్డుల్లోనూ మొదట బలమైన అభ్యర్థులను ఎంపిక చేయడంతో మొదలుకొని పక్కా ప్రణాళికతో పోల్ మేనేజ్మెంట్ వరకూ మంత్రి అడ్లూరి వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు మాత్రం స్పష్టం అవుతోంది. ప్రచారంలోకి దిగిన తొలిరోజు కేవలం 5 సీట్లలో మాత్రమే బలంగా కనిపించిన కాంగ్రెస్ అభ్యర్థులు మంత్రి స్వయంగా రంగంలోకి దిగినాక సీన్ మారిందని అందరి నోటా వినిపిస్తోంది. ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ పోటీ బలంగా ఉన్న స్థానాలపై ఫోకస్ పెట్టి మంత్రి గట్టిగా ప్రచారం కొనసాగించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాబోయే ఆరు నెలల్లో పూర్తిచేస్తానని, 2027 పుష్కరాలకు వందల కోట్ల నిధులు తీసుకొచ్చి ధర్మపురి రూపురేఖలు మారుస్తానని అడ్లూరి ఇచ్చిన మాట ఈ ఎన్నికల విజయం సీఎం ను మెప్పించి కావలసిన నిధులు వచ్చేలా చేస్తుందని పట్టణవాసులు గట్టిగా నమ్ముతున్నారు.

## బండి సంజయ్ సమక్షంలో బిజెపిలో చేరిన ఇద్దరు స్వతంత్రులు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఇద్దరు శనివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బిజెపిలో చేరారు. 39వ డివిజన్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థి గా విజయం సాధించిన మాసం గణేష్, 17 డివిజన్ అభ్యర్థినిగా విజయం సాధించిన వేముల కవిత కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. ఇప్పటికే ఒక స్వతంత్ర అభ్యర్థి, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఫలితాలు వెలువడిన రోజే బిజెపిలో చేరగా శనివారం మరో ఇద్దరు స్వతంత్రులు బిజెపిలో చేరారు. దీంతో బిజెపి సంఖ్య 34 కు చేరింది.

# సిపిఐ కంచుకోట, ఎల్బినగర్‌లో మరోసారి ఎగిరిన ఎర్రజెండా

### మాజీ మేయర్ పై 119 ఆధిక్యంతో ఘనవిజయం

### డివిజన్ ప్రజలకు రుణపడి ఉంటా



ప్రజాపక్షం/పెద్దపల్లి: రామగుండం నోటిఫైడ్ ఏరియా నుండి మున్సిపాలిటీగా మారిన తర్వాత 1998లో జరిగిన మొదటి మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థిగా మార్కపురి తిరుపతి గెలుపొందడం జరిగింది. అనంతరం 19వ వార్డు అనేక రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు మున్సిపల్ లో ఉన్న అన్ని వార్డు సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారు. ఆయన స్ఫూర్తితో 2009లో విద్యార్థి నాయకుడిగా ఏఐఎస్ఎఫ్ నుండి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన కుమారుడు మార్కపురి సూర్య అంచెలంచెలుగా కమ్యూనిస్టు పార్టీలో ఎదుగుతూ అనేక పదవులు అలంకరించడంతోపాటు అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొనడం అనేక కేసులను ఎదుర్కోవడం జరిగింది. 28 సంవత్సరాల తర్వాత మొన్న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా మార్కపురి సూర్య పోటీ చేయడంతో పాటు ఆ స్థానం నుండి గెలిచి తండ్రికి తగ్గ తనయుడు గా పేరు తెచ్చుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న సూర్య రాబోయే రోజుల్లో రామగుండం కార్పొరేషన్ ప్రజల గొంతుకగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడానికి ఎల్బీనగర్ ప్రజలు ఇచ్చిన విలక్షణ తీర్పు గొప్ప. సూర్య మాట్లాడుతూ ఎల్బీనగర్ ప్రజలు రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో ఒక గట్టి సమాధానాన్ని చెప్పారని వారి తీర్పు నాపై మరింత బాధ్యతను పెంచడంతో పాటు డివిజన్ అభివృద్ధి పట్ల నిబద్ధుడిని పనిచేసే విధంగా ప్రజలకు జీవితకాలం రుణపడి ఉంటానని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ఒకే ఒక్కడు : పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ లు ఉండగా రామగుండం కార్పొరేషన్ లో సిపిఐ పార్టీ నుండి మార్కపురి సూర్య 41 డివిజన్ నుండి కార్పొరేటర్ గా గెలుపొందడంతో పెద్దపల్లి జిల్లాలోనే ఒకే ఒక్కడు గా నిలిచారు.

## బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు




ప్రజాపక్షం/కరీంనగర్: బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వార్షిక క్రీడోత్సవం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ భాబితా విశ్వనాథన్, అకాడమిక్ డైరెక్టర్ బబ్లు రెహమాన్, పరిపాలన అధికారి అసిఫ్, వ్యాయామ ఉపాధ్యాయ విభాగాధిపతి మురళి, పీటీ ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాలలోని విద్యార్థులను నాలుగు హౌసులుగా స్పిరిట్, లెగసి, అంబిషన్, డిస్కవరీ విభజించి వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడోత్సవంలో నిర్వహించిన ప్రధాన క్రీడలు బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ (100 మీ., 200 మీ., 400 మీ. పరుగులు, రిలే రేసులు) లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, మెడిసిన్ త్రో స్కేటింగ్ పోటీలు కబడ్డీ తాడు లాగుడు నిర్వహించినారు. విద్యార్థులు తమ ప్రతిభను, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విజేతలైన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. గెలుపొందిన విద్యార్థులను చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందిస్తూ, క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ, జట్టు భావం, నాయకత్వ లక్షణాలు క్రీడల ద్వారా అభివృద్ధి చెందుతాయని తన ప్రసంగంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పిల్లలను ప్రోత్సహించారు.

## మహా శివరాత్రి శుభాకంక్షలు తెలిపిన మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రిని ప్రజలంతా భక్తి, శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పరమేశ్వరుని అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజల జీవితాల్లో శాంతి , శుభం నెలకొనాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# వికసిత భారత్ శిక్ష అభియాన్ బిల్లు వ్యతిరేకించండి




ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా కేంద్రం లోని టీఎన్జీవో భవన్లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆవాలు నరహరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ (టిసిఈసి) సహ ప్రధాన కార్యదర్శి ముష్కుల రఘు శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి నిధులు కేటాయించకుండా కార్పొరేట్ రంగాన్ని బలోపేతం చేసే విధంగా ప్రవేట్ యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ లేని విద్యా విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని, పాఠ్యాంశాలలో సైంటిఫిక్ భావజాలాన్ని తగ్గిస్తూ, శాస్త్రీయమైన అంశాలను పాఠ్యాంశాలలో చెప్పిస్తూ, ప్రజలను మధ్యయుగంలోకి తీసుకెళ్లే విధంగా విద్యా విధానాన్ని రూపొందిస్తుందని, ఇది సరైన విధానం కాదని దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని అన్నారు. ఫెడరల్ విధానానికి వ్యతిరేకంగా విద్యారంగాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకువచ్చే వికసిత భారత్ శిక్ష అభియాన్ బిల్లును వ్యతిరేకించాలని అన్నారు. విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం నుండి తప్పుకొని ప్రైవేటీకరణకు కార్పొరేటీకరణకు అనుకూలంగా వివరిస్తుందని ఆరోపించారు. డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా ఒకే విధానాన్ని అనుసరిస్తూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయి అన్నారు. జీవో 25 ద్వారా ప్రాథమిక విద్యను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది దీనిని అందరు వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిసిఈసి బాధ్యులు వేల్పుల రత్నం, ఆంజనేయ రావు, రామ లింగా రెడ్డి, ఏసురెడ్డి, జె.ల్ అసోసియేషన్ బాధ్యులు సుధాకర్, శ్రీనివాస్, తిరుమలయ్య, టీపీటీఫ్ బాధ్యులు రామచంద్ర రెడ్డి, శ్రీనివాస్, డీటీఫ్ బాధ్యులు చకినాల రామ్మోహన్, తూముల తిరుపతి, శంకర్, రమేష్, రామ్, కిరణ్ హుమేరా జబీన్, రవీంద్ర కుమార్, వెంకటేశ్వర రెడ్డి, ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ సంజీవ్, శివ కుమార్, సతీష్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, అరవింద్, రమేష్, పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నగునూరు గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల వద్ద అదే గ్రామానికి చెందిన బోదాసు అచ్యుత్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద తన ట్రాక్టర్‌లో అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. దుర్శేడ్ గ్రామానికి చెందిన శ్రీరామోజు తిరుపతి అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అట్టి నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.



